క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

ప్రొద్దుటూరు : మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి గురువారం 13వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా వార్డు సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. సున్నంబట్టి వీధిలోని ప్రధాన కాలువ సమస్యపై దృష్టి సారించాలన్నారు.

విద్యావ్యవస్థను కాపాడాలి

కాశినాయన : రాష్ట్రంలో విద్యావ్యవస్థ తీరు అస్తవ్యస్తంగా ఉందని, నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యావ్యవస్థను చక్కదిద్దాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ సుబ్రమణ్యం, మండల అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్రబాబు, బాలఓబయ్యలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎస్టీయూ రీజనల్ కార్యాలయంలో ఎస్టీయూ మండలశాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచినా విద్యాశాఖ ఇప్పటి వరకు అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేయలేదని విమర్శించారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం జీఓ 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ విధానం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

కలసపాడు : మండల కేంద్రంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలను గురువారం బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తనిఖీ చేశారు. లైసెన్స్ గడువు, స్టాకు రిజిస్టర్లలో నిల్వలు, గోడౌన్‌లో నిల్వలను పరిశీలించారు. రసీదు పుస్తకం, ఇన్‌వాయిస్, వేబిల్స్ పరిశీలించారు. ఎప్పటికప్పుడు ధరల స్టాకు బోర్డు వివరాలను ఉంచాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నాణ్యమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని సూచించారు. గడువు ముగిసిన మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ జాకీర్‌షరీఫ్ పాల్గొన్నారు.

పోలీసులకే రక్షణ కరువైంది

ప్రొద్దుటూరు : ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులకే టీడీపీ ప్రభుత్వంలో రక్షణ కరువైందని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కరుణాకర్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కోసం ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన టీడీపీ మాజీ కౌన్సిలర్ జయలింగారెడ్డి పోలీసులను పరుష పదజాలంతో దూషించడం తగదని పేర్కొన్నారు. పోలీసులకే రక్షణ లేకుంటే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పత్రికల్లో వచ్చిన వార్తలను ఆధారంగా చేసుకుని సుమోటాగా చర్యలు తీసుకోవాలని కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ప్రొద్దుటూరులో విచ్చలవిడిగా ఇసుక మాఫియా, బియ్యం అక్రమ రవాణా సాగుతోందని ఆరోపించారు.

చేపల వేటకు వెళ్లొద్దు

గోపవరం : విరామ సమయంలో చేపలవేటకు వెళ్లద్దని ఎఫ్‌డీఓ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం సోమశిల వెనుక జలాల వద్దకు సిబ్బందితో కలిసి చేపలవేటపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

జూలై, ఆగస్టు రెండు మాసాలు చేపల వేటకు విరామ సమయం ప్రకటించినందున మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్ళవద్దని తెలిపారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి వేటకు వెళితే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయకులు కొండయ్య, బలకుమార్‌రెడ్డి, మహిళా పోలీసు విష్ణుప్రియ, వీఆర్‌ఏ పెంచలయ్య తదితరులు ఉన్నారు.

డయేరియా రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ఖాజీపేట : మిడుతూరు గ్రామంలో డయేరియాతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్యం వెంకసుబ్బారెడ్డి కోరారు. మిడుతూరు గ్రామంలో డయేరియా రోగులను పరామర్శించారు. అనంతరం డయేరియాతో మృతి చెందిన సునీల్ మృతదేహాన్ని పరిశీలించారు. సునీల్ కుటుంబాన్ని ఓదార్చారు. 24 గంటలు వైద్య సదుపాయాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓకు ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు పోట్లదుర్తికి ఎంపీ సీఎం రమేష్

ప్రొద్దుటూరు : అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్ నాయుడు శుక్రవారం ఆయన స్వగ్రామం పోట్లదుర్తికి రానున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంకదార నరేంద్రరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సీఎం రమేష్‌నాయుడు బీజేపీ తరపు ఎంపీగా గెలిచిన తర్వాత తొలి సారిగా తన స్వగ్రామానికి వస్తున్నారన్నారు.

శుక్రవారం ఉదయం 9.30 గంటలకు కడప ఎయిర్ పోర్టుకు చేరుకుంటారని, అక్కడి నుంచి చెన్నూరు, ఖాజీపేట, మైదుకూరు, చాపాడు మీదుగా ర్యాలీగా ప్రొద్దుటూరుకు చేరుకుంటారని, మైదుకూరు రోడ్డు, శివాలయం సర్కిల్, రాజీవ్ సర్కిల్, టీబీ రోడ్డు, గాంధీ రోడ్డు మీదుగా ర్యాలీగా పోట్లదుర్తికి చేరుకుంటారని వివరించారు. ఈ ర్యాలీని బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అధిక జనాభా అభివృద్ధికి ఆటంకం



ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



దువ్వూరు : ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది



బద్వేలు అర్బన్ : పీహెచ్‌సీలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దువ్వూరు : అధిక జనాభా అభివృద్ధికి ఆటంకమని వైద్యులు సురేష్‌బాబు, వికసతి, హిమబిందు పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది గురువారం పీహెచ్‌సీ నుంచి దువ్వూరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జనాభా పెరుగుదలకు సంబంధించి ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు ఐక్యరాజ్య సమితి 1989 జూలై 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనాభాకు తగిన వనరులు లేక ఇబ్బందులు ఎదురవుతాయని, కాబట్టి ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు రాజగోపాల్, సువర్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ సమష్టి బాధ్యత

బద్వేలు అర్బన్ : దేశ ప్రగతికి ఆటంకంగా మారుతున్న జనాభా పెరుగుదలను నియంత్రించేందుకు కృషి చేయాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ జోత్స్నస్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా పెరుగుదల వలన ఆహార కొరత, పేదరికం, నిరుద్యోగ సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, సీహెచ్‌ఓ చంద్రవతి, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కరు పాల్గొన్నారు.

జనాభా పెరుగుదలను నియంత్రించాలి

ప్రొద్దుటూరు క్రైం : జనాభా పెరుగుదలను నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందని డాక్టర్ భరత్‌నారాయణ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం శ్రీరాములపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం మన దేశంలో జనాభా బాగా పెరుగుతోందని తెలిపారు. జనాభా పెరుగుదలను నియంత్రించాలంటే ఒకరు లేదా ఇద్దరు మాత్రమే హద్దు అనే నినాదాన్ని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శ్రీనివాసనగర్ యూపీహెచ్‌సీ పరిధిలో..

శ్రీనివాసనగర్‌లోని యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న రమణ మహర్షి హైస్కూల్‌లో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. జనాభా పెరుగుదల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వైద్యాధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీఓ నాగజ్యోతి, హెడ్ మాస్టర్ రవిప్రకాష్, రామయ్య, ఏఎన్‌ఎం సీతామహాలక్ష్మి, ఆశా వర్కర్లు సుగణ, జానకి పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీ పరిధిలో..

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని గోపవరం, సోములవారిపల్లెలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగార్జున, డీపీఎంఓ శ్రీను, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీను, సీహెచ్‌ఓ కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో..

సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీబీరోడ్డు పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎన్ హిమబిందు మాట్లాడుతూ చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని చెప్పారు. అనంతరం పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిర్డ్ సొసైటీ ప్రెసిడెంట్ ఎంవీ సుబ్బారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చాపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం మండల సర్వ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రహంతులయ్య తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజాప్రతినిధులతో పాటు అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

దువ్వూరు : దువ్వూరు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరవుతున్నారని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రెడ్డిపల్లెలో పశువైద్య శిబిరం

కలసపాడు : మండలంలోని రెడ్డిపల్లెలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్, పశువైద్య సహాయ శిక్షకులు డాక్టర్ శివరామిరెడ్డి పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 16 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, ఎదకు రాని 40 పశువులు, చూలు పరీక్షల్లో పాల్గొన్న 22 పశువులు, 18 పశువులకు చికిత్స అందించారు. దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల ఏడీఏ డాక్టర్ కె.చంద్రశేఖర్, టేకూరుపేట పశువైద్యాధికారి శివశ్రీనివాసులరెడ్డి, కలసపాడు పశువైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం : బి.మఠం మండలాన్ని కలిసికట్టుగా అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కోరారు. గురువారం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ సహకారంతో బ్రహ్మంగారిమఠం మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. తాగు, సాగు నీరు, వ్యవసాయం, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని అన్ని చెరువులకు సాగునీరు అందిచేందుకు అధికారులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. మండల సమావేశంలో పలు శాఖల అధికారుల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంకు హాజరు కానీ అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ జాన్స్, ఎంపీపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో అతిసార నియంత్రణ



వెదురూరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

చాపాడు : పరిశుభ్రతతో అతిసార వ్యాధిని నియంత్రించవచ్చని వైద్యాధికారులు శ్రీవాణి, ఓబులేసు తెలిపారు. అతిసార నుంచి పిల్లలను తల్లిదండ్రులు రక్షించుకోవాలని సూచించారు. చాపాడు, నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గురువారం స్టాప్ డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బిడ్డలకు రోజులో మూడు లేదా నాలుగు సార్లు పలుచగా విరోచనాలు అయితే అతిసారగా గుర్తించి వైద్యులను సంప్రదించాలన్నారు. దీని నివారణ కోసం విటమిన్-ఏ సిరప్ తాగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్లు సరస్వతీ, బాబురెడ్డి, ఆయా పాఠశాలల సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ అంజుమ్, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ఈయూ లక్ష్యం



కేక్ కట్ చేస్తున్న ఈయూ జిల్లా అధ్యక్షుడు బోసుబాబు, నాయకులు

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ లక్ష్యమని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు బోసుబాబు పేర్కొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం డిపో ఆవరణలోని యూనియన్ కార్యాలయం వద్ద ఈయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1953 జూలై 11న ఆవిర్భవించిన ఎంప్లాయిస్ యూనియన్ నాటి నుండిచి నేటి వరకు కార్మికుల పక్షాన నిలబడి ఎన్నో రాజీలేని పోరాటాలు కొనసాగించి విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ శాశ్వత గౌరవాధ్యక్షులు ఐ.ఎం.రావు, డిపో కార్యదర్శి బి.పి.నరసింహులు, గ్యారేజీ సెక్రటరీ రాజశేఖర్, యూనియన్ నాయకులు గంగయ్య, సి.ఎస్.రెడ్డి, మాధవరెడ్డి, పెంచలయ్య, జి.ఎస్.వాసులు, పెద్ద ఎత్తున ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సహజవాయువు నిక్షేపాల కోసం సర్వే



రాజుపాళెం పొలాల్లో సహజ వాయువుల కోసం బోర్లు వేస్తున్న దృశ్యం

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెం, ఏరువపాళెం గ్రామాల్లోని పొలాల్లో గురువారం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆయిల్ న్యాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) సర్వే చేస్తోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వాహనం, రిగ్గు సహాయంతో బోర్లు వేసి ప్రత్యేక సేన్సార్ల ద్వారా ముమ్మర సర్వే చేస్తున్నారు. గతేడాది వేసవి కాలంలో మండలంలోని వెల్లాల కేంద్రంగా త్రీ డీ సర్వే నిర్వహించారు. ఈ సర్వే రిపోర్టులను డెహ్రాడూన్‌కు పంపించిన తర్వాత అక్కడి నుంచి వచ్చిన ఫలితాల ఆధారంగా ఈ ప్రాంతంలో సహజ వాయువుల నిక్షేపాలపై పూర్తి సమాచారం తెలుస్తున్నట్లు ఓఎన్‌జీసీ సంస్థ బృందం తెలిపింది.

తక్కువ ధరకే సరుకులు

ప్రొద్దుటూరు : తక్కువ ధరకే ప్రభుత్వం సరుకులను అందించేందుకు చర్యలు తీసుకుంటోందని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మండి కాంప్లెక్స్‌లోని దుకాణాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రీటైల్ కౌంటర్లను ఆర్డీఓ గురువారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండి కాంప్లెక్స్‌లో ఐదు కౌంటర్లతో పాటు విశాల్ మార్ట్, ఎస్ఎస్ మాల్‌లో ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. కిలో కంది పప్పు రూ.160, బీపీటీ సోనా మసూరి బియ్యం కిలో రూ.49, సాధారణ సోనా మసూరి బియ్యం కిలో రూ.48 చొప్పున విక్రయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి, వ్యాపార ప్రముఖులు అశోక్‌రెడ్డి, బాదుబోయిన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొర్రపాడులో సినిమా షూటింగ్



కొర్రపాడులో జరిగిన షూటింగ్‌లో ఓ సన్నివేశం

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలోని ఫంక్షన్ హాలులో శుక్రవారం సినిమా షూటింగ్ జరిగింది. కొండారెడ్డి ట్రాన్స్‌పోర్టు అధినేత బాణా వెంకట కొండారెడ్డి కుమారుడు ప్రొడ్యూసర్ బాణా సుశీంద్రనాథ్ రెడ్డి పర్యవేక్షణలో హీరోయిన్ పృథ్వీ శెట్టి, హీరోయిన్ శ్రావణితో షూటింగ్ తీశారు. షూటింగ్‌ను చూసేందుకు పెద్దసంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చారు.

దోమల నివారణపై చర్యలు

పోరుమామిళ్ల (అట్లూరు) : దోమల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు, పంచాయతీ విస్తరణాధికారి రాజీవరెడ్డి పేర్కొన్నారు. పోరుమామిళ్ల మండల పరిధిలోని రంగసముద్రంలో గురువారం దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందన్నారు. అలాగే గిరినగర్, మహబూబ్‌నగర్, రాఘవేంద్రనగర్‌లో దోమల నివారణకు మందులు పిచికారీ చేశామని తెలిపారు.

రక్తదానం

పోరుమామిళ్ల (అట్లూరు) : ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యాధిగ్రస్తులకు ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి యువసేన రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలిచారు. పోరుమామిళ్ల పట్టణంలోని ప్రసాద్ ఆసుపత్రిలో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన సంధ్య అనే మహిళకు అత్యవసరం రక్తం అవసరం కాగా విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి యువసేన సభ్యుడు సంతోష్ అనే యువకుడు వెంటనే స్పందించి ఆసుపత్రికి వెళ్లి మహిళకు రక్తదానం చేశారు. దీంతో రక్తదానం చేసిన సంతోష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎంపీజే పట్టణ నూతన కమిటీ సభ్యులు

బద్వేలు అర్బన్ : ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ బద్వేలు తాలూకా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గురువారం పట్టణంలో ఏపీజీఈఏ కార్యాలయంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజారత్నం, చంద్రమౌళి సమక్షంలో బద్వేలు నియోజకవర్గ అధ్యక్షుడిగా నరసింహప్రసాద్, సెక్రటరీగా జాన్‌విలియం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వెంకటసుబ్బయ్య, ట్రెజరర్‌గా రామతీర్థం, ఉపాధ్యక్షులుగా వాణిశ్రీ, సుబ్బనరసమ్మ, రమణయ్య, వెంకటసుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బుజ్జమ్మ, జాయింట్ సెక్రటరీలుగా గాయత్రి, గురమ్మ, నాగేశ్వర్‌రావు, ఈశ్వరమ్మను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బద్వేలు తాలూకా అధ్యక్షులు హుసేనయ్య, సెక్రటరీ పుష్పరాజ్, ట్రెజరర్ బ్రహ్మారెడ్డి, ప్రొద్దుటూరు, సిద్దవటం తాలూకాల అధ్యక్షులు రామచంద్రయ్య, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీజే పట్టణ కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జిన్నా రోడ్డులోని మూవ్‌మెంట్ ఫర్ జస్టిస్ (ఎంపీజే) కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, ఎంపీజే సుప్రీం కౌన్సిల్ మెంబర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో పట్టణ నూతన కమిటీని ప్రకటించారు. పట్టణ అధ్యక్షుడిగా షేక్ హుస్సేన్ బాషా, ప్రధాన కార్యదర్శిగా షేక్ మహమ్మద్ రఫిక్, కోశాధికారిగా యు.ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడుగా మహమ్మద్ నజీర్, సహాయ కార్యదర్శిగా అబ్దుల్ గని, మీడియా కార్యదర్శిగా అస్లాం, సయ్యద్, ఇబ్రహీం, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, జమా అతె ఇస్లామి హింద్ పట్టణాధ్యక్షుడు షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.